# సయోనరా!

ఎం. వీరేశ్వరరావు

అసలు రచనలు చెయ్యడం కూడా ఒక వ్యసనమేమో! రచనలు చెయ్యడం, అవి బాగున్నాయని చదివిన వాళ్ళు అనడం, మళ్ళీ రాయడం. మళ్ళీ అచ్చవ్వడం వీటన్నిటివల్ల రచన వ్యసనంలా తయారవుతుంది. ఆరోజు వ్రాయడానికి ఏం కనిపించలేదు.

వీధిగది కిటికీ తెరిచి కూర్చున్నాను. "తెరిచిన కిటికీ ప్రపంచానికి మినియేచర్!" అన్నాడొక హైకూ కోయిల! నేను కూర్చున్నాక నా స్నేహితుడు భరత్ వచ్చాడు. వాడు నాకు డిగ్రీలో క్లాస్‌మేట్. ఈమధ్యే హైదరాబాద్ వచ్చాడు ఉద్యోగం అన్వేషణ గురించి.

'శేఖర్ నేను కథ చెప్తాను వ్రాస్తావా?'

'కథ కోసమే కదా కాచుక్కూర్చున్నాను'

ఇద్దరం కుర్చీలలో సెటిలయ్యాము. భరత్ ప్రారంభించాడు.

** ** **

భరత్ చిన్నప్పుడు అగ్రహారంలో ఉండేవాడు. భరత్‌కి పదేళ్ళ వయస్సులో ఒకరోజు పెద్ద కళ్ళు. రెండు జళ్ళు ఉన్న అమ్మాయి వచ్చి 'సయోనరా' అంటే ఏమిటి అని అడిగింది. సయోనరా అంటే జపాన్ భాషలో గుడ్‌బై అని అర్థం అని చెప్పి ఎవరు నువ్వు అని అడిగాడు భరత్. మేము మీ ఇంటి పక్కన అద్దెకు వచ్చాము అని చెప్పింది. పెద్ద కళ్ళ అమ్మాయి పేరు 'ప్రియ'. అలా పరిచయం అయ్యాక ఇద్దరూ కలిసి స్కూలుకు వెళ్ళేవారు. ఇద్దరూ కలిసి ఆడుకొనేవారు. ప్రియకు వర్షం అంటే చాలా ఇష్టం. చాలాసార్లు వర్షంలో తడిసి ఇంట్లో దెబ్బలుతింది. భరత్ ప్రియ కోసం కాగితం పడవలు చేసేవాడు. ఒకసారి పడవలు చేయడానికి చిత్తు కాగితాలు దొరక్కపోతే మ్యాథ్స్ హోమ్‌వర్క్ పుస్తకంలోని కాగితాలు చించి, లెక్కలు మాస్టారుచే దెబ్బలు తిన్నాడు.

మరోసారి నెమలికన్ను తెలుగు వాచకంలో దాచుకోవడానికి, నెమలికన్ను ఆహారానికి తాటిమట్టల దగ్గరికి వెడితే చేతులు గీరుకొని రక్తం వచ్చింది. భరత్ తన చేతి మీద ఉన్న మచ్చ చూపించాడు. రక్తం వచ్చిన రోజున భరత్ నాన్న గట్టిగా కేకలు



వేసాడు ప్రియతో తిరగవద్దని.

నాలుగు రోజుల తర్వాత భరత్ చెరువులో ఈదుతున్నాడు. గట్టువైపుకు వస్తుంటే వెనుకనుండి ఎవరో కళ్ళు మూసారు. చేతులతో రాసి చూసారు. వెనుక 'ప్రియ'.

"పెద్ద మగరాయుడిలా చెరువులో ఈత కొట్టడానికి వచ్చావా?"

"చాల్లే గొప్ప నేను మాత్రం కొట్టలేనా ఈత!" అంటూ లోయ ఉన్నవైపు వెళ్ళింది.

వెంటనే భరత్ ప్రియ చెయ్యి పట్టుకొని తనవైపు లాక్కున్నాడు. ఒంట్లో ఏదో గిలిగింత.

"ఆడపిల్లకి ఈత ఏమిటి?" అని ప్రియని ఇంట్లో తిట్టారు.

'ఆడపిల్లను చెరువుకు తీసుకువెడతావా" అని భరత్ నాన్న వీపుమీద రెండు వడ్డించాడు. అలా ఇద్దరూ హాయిగా ఆడుతూ, నవ్వుల్తో, కేరింతల్తో కాలాన్ని కొలుస్తుంటే ప్రియ నాన్నకి ట్రాన్స్‌ఫర్ అయింది. ప్రియ వెళ్ళిపోయింది భరత్‌ని విడిచిపెట్టి. తరువాత ప్రియ నుండి ఉత్తరాలు లేవు భరత్‌కి.

** ** **

"తరువాత ప్రియకనిపించిందా?" అడిగాను ఆతృతగా.

'కనబడలేదు. ప్రయత్నాలు చేసాను' అన్నాడు భరత్.

మళ్ళీ భరత్ చెప్పడం ప్రారంభించాడు.

** ** **

ప్రియ తలపులే తలుస్తూ యవ్వనంలోకి ప్రవేశించాడు భరత్. అతను బియస్సీ చదువుతున్నప్పుడు వ్రాసిన కవిత కాలేజ్ మేగ్‌జైన్‌లో అచ్చయినప్పుడు మంచి స్పందన వచ్చింది. ఆ కవిత ఇది

ఒకే కప్పు క్రింద రెండు ఆత్మలు
కావాలి నాకు
సహనంగావేచే రెండు కళ్ళు
ప్రేమామృతాన్ని అందించే రెండు పెదవులు
ఆర్తిగా చుట్టుకొనే రెండు చేతులు
ఒకరికొకరు అద్వైతానందాన్ని పంచుకొనే
రెండు క్షణాలు!

భరత్‌తో మాట్లాడాలని చాలామంది అమ్మాయిలు ప్రయత్నించారు. కానీ అతను అవకాశం ఇవ్వలేదు. ఎక్కువగా ఒంటరితనాన్ని ఇష్టపడేవాడు.

** ** **

'సరే ఇంత వరకూ చెప్పాను. ముగింపు నువ్వు ఊహించి కథ వ్రాయి" అన్నాడు భరత్. కొద్దిసేపటికే భరత్‌పని ఉందని చెప్పి వెళ్ళిపోయాడునేను ఆలోచనలో పడ్డాను. ఎలా వ్రాయాలి. ఏదో డ్రమటైజ్ చేసి వ్రాస్తేకాని పాఠకులు ఊరుకోరు. 'కొసమెరుపుతో ఎలా వ్రాయాలి' అని ఆలోచిస్తున్నాను. పదిహేనేళ్ళ క్రితం ఏదో పల్లెటూర్లో చూసిన అమ్మాయిని మళ్ళీ కలిసాడా? కలిస్తే ఏం జరిగింది? ఆలోచించాక ఒక ముగింపు తట్టింది.

** ** **

కూకట్‌పల్లిలో హోటల్‌లో టీ తాగుతున్న భరత్‌కి ఒక ముసలాయన పరిచయం అయ్యాడు. ఆయన మాటల సందర్భంలో ప్రియ మేనమామ అని చెప్పాడు. ఆయన ద్వారా తెలిసింది ఆరోజే ప్రియ గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో రాజమండ్రి వెడుతోందని. అప్పుడు సమయం నాలుగు గంటల పదిహేను నిమిషాలైంది. వెంటనే ఆటో ఎక్కాడు. ఆటో పంజగుట్ట సిగ్నల్ దగ్గర ఆగింది. ట్రాఫిక్ క్లియర్ అవ్వడానికి పదినిమిషాలు పట్టింది. సమయం 4.50 అయింది. భరత్‌లో టెన్షన్ పెరుగుతోంది. సరిగ్గా 5గం.లకు నాంపల్లి స్టేషన్‌కి చేరాడు. కోచ్ ఎస్3ని వెదికి, సీట్ నెంబర్ 10ని చూశాడు. ప్రియ కనబడింది. పక్కన ఒక వ్యక్తి కూర్చున్నాడు. ప్రియ మెడలో కొత్త మంగళసూత్రాలు మెరుస్తున్నాయి. పలకరించుదామనుకున్నాడు. పలకరిస్తే భర్త అనుమానిస్తాడేమో! నామూలంగా ప్రియకు కష్టాలు రాకూడదు. పలకరించలేదు. గోదావరి కదిలింది. నెమ్మదిగా కనుమరుగైంది.

## జీవితంలో వైవిధ్యం రాహుల్ అభిమతం!



దీపా మెహతా చిత్రం '1947 ఎర్త్' ద్వారా వెండితెర ప్రేక్షకులకు పరిచయమయమైన .రాహుల్ ఖన్నా సినిమా రంగంతో తన జీవితాన్ని ముడేసుకొని విషయమై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదంటున్నాడు. తొలి చిత్రం ద్వారానే ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొన్న ఈ నటుడు వినోద్‌ఖన్నా కుమారుడు. నందితాదాస్, అమీర్‌ఖాన్ వంటి అనుభవమున్న నటుల పక్కనే 'ఎర్త్' చిత్రంలో నటించిన రాహుల్‌కు ప్రధానంగా నాటకరంగమంటే ఎనలేని అభిమానం. 'ఎర్త్' సినిమా అనంతరం అతను న్యూయార్క్‌లో 11 వారాల పాటు నడిచిన 'ఈస్ట్ ఇజ్ ఈస్ట్' అనే నాటకంలో నటించాడు. జీవితాన్ని ఏదో ఒక రంగంతోనో, ఓ ప్రాంతంతోనో కుదించుకోవడం తనకు ఇష్టం లేదని చెబుతాడు. ప్రపంచాన్ని చుట్టేస్తూ నచ్చిన పనిచేసుకుంటూ పోవాలన్నది అతని అభిమతం. అందుకేనేమో వెండితెర తన అంతిమలక్ష్యంగా నిర్ణయించుకోవడానికి తను సిద్ధంగా లేడు. 'ఎర్త్' సినిమాలో విలక్షణమైన పాత్రను పోషించిన రాహుల్ వృత్తి, ప్రవృత్తి వైవిధ్యంతో ఉండాలని ఆశిస్తాడు. కేవలం ఒకే ఒక్క సినిమా ద్వారా జాతీయంగా, అంతర్జాతీయంగా అన్ని వర్గాల ప్రశంసలందుకున్నాడు.

